వైభవంగా చౌడమ్మ బోనాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


చిన్నారుల కోలాటం


కావేరమ్మపేట చావిడి వద్ద రద్దీ


ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో చౌడమ్మ బోనాల ఉత్సవం ఆదివారం సాయంత్రం యాదవసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కావేరమ్మపేట నుంచి శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బుట్టలను అలంకరించి కొత్త కుండలను ఉంచి అందులో నవధాన్యాలు, బెల్లం, ఇతర వంటసామగ్రిని అందులో పెట్టుకుని తలపై ఉంచుకుని ఊరేగింపుగా చౌడమ్మ ఆలయానికి చేరుకున్నారు. యాదవ సంప్రదాయ ప్రకారం.. మేళతాళాలు, నృత్యాలతో ఊరేగింపు వైభవంగా సాగింది. పోతురాజుల విన్యాసాలు, చిన్నారుల కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. బోనాలతో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నైవేద్యాలు సమర్పించి రాత్రి వంటావార్పుతో భోజనాలు చేసుకున్నారు. బోనాల ఉత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హాజరై యాదవులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి సైతం బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు.


పోతురాజుల విన్యాసాలు

క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



జడ్చర్ల: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, కౌన్సిలర్లు విజయ్, రమేశ్, నాయకులు రవిశంకర్, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నవాబుపేట: కాకర్‌జాల్ గ్రామపరిధిలో వెలసిన గిరిజనుల ఆరాధ్యదైవం ఆంజనేయ స్వామి శ్రావణ మాస ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను.. ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమలో గిరిజన నాయకులు సంతోష్ నాయక్, లక్ష్మణ్, ధర్మ, శంకర్, సక్రీయ, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మకు ప్రత్యేకపూజలు



నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ చెంత ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. పచ్చని చెట్ల కింద విందులు చేసుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన చంద్రకళ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద ఉంటూ కోలుకుంటోంది. బాధితురాలిని ఆదివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద ఘటనపై ఆరా తీసి ఆస్పత్రి వైద్య ఖర్చులకు సాయం చేస్తానని బాధితురాలి కుమారుడు మధుసూదన్‌గౌడ్‌కు హామీ ఇచ్చారు.మాజీ సర్పంచ్ జయన్నగౌడ్, వెంకట్రాములు, గోపాల్‌గౌడ్, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఖాజాఘోరీ, రమేష్ తదితరులు ఉన్నారు.

దయాకర్‌రెడ్డికి ఘననివాళి



దేవరకద్ర: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి జయంతి ఆదివారం నిర్వహించారు. దేవరకద్ర పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉండి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు ఆది హన్మంతరెడ్డి, రవి, మోహన్‌రెడ్డి, మశ్చందర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఇంకా వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

దాడి చేశారని ప్రశ్నిస్తే కేసుపెట్టారు?

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని వైన్‌షాపు వద్ద శనివారం జరిగిన గొడవలో వైన్ షాపు నిర్వాహకులు తమను కొడుతున్నారని 100కు డయల్ చేస్తే పోలీసులు వచ్చి తమపైనే కేసు పెట్టారని బాధితుడు జనార్దన్ వాపోయాడు. మద్యం తాగడానికి నడిచి వెళ్లడంతో పాటు ఎలాంటి వాహనం నడుపకున్నా బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి మద్యం తాగినట్లు తమపై తప్పుడు కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. తమపై దాడి చేశారని ఫిర్యాదు చేసినందుకు తమపైనే కేసు ఎలా పెడతారని ప్రశ్నిస్తే పోలీసులు చేయి చేసుకున్నారని ఆరోపించాడు.

రెడ్డిపల్లిలో నీటి ఎద్దడి


రెడ్డిపల్లిలో ట్యాంకరు ద్వారా నీటి సరఫరా

అవస్థలు పడుతున్న గ్రామస్తులు

గండీడ్: మండలపరిధిలోని రెడ్డిపల్లిలో నీటి ఎద్దడి నెలకొంది. రెండు మూడు నెలలుగా నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరు సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉంది. మహబూబ్‌నగర్–చించోళి రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామానికి సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. విషయాన్ని గ్రామస్తులు నేషనల్ హైవే వాళ్ల దృష్టికి తీసుకెళ్లారు. అయితే వాళ్లు ఈ రోజు.. రేపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో చేసేది లేక ట్యాంకరుతో నీటిని గ్రామానికి సరఫరా చేస్తూ వచ్చారు. అయితే గత నాలుగు రోజులుగా అది కూడా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పొలాల వద్ద తెచ్చుకోవడంతో పాటు కొంతమంది ఫిల్టర్ నీటిని కొనుక్కొని వాడుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. కార్యదర్శికి, ఎంపీడీఓకు వివరించినా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు చేసి నీటిసమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా పైపులైను డ్యామేజీ అయిన విషయం నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో పాటు ఎంపీడీఓకు లిఖితపూర్వకంగా ఇచ్చామని పేర్కొన్నారు. రెండు మూడు రోజులుగా వారిని ఒత్తిడి చేయడంతో సోమవారం వచ్చి మరమ్మతులు చేస్తామని చెప్పారని వివరించారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో రోడ్డు పక్కన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. ఈ దారిలో నిత్యం భూత్పూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రహదారిని విస్తరించడంతో రోడ్డుకు అతి దగ్గరగా ట్రాన్స్‌ఫార్మర్ కనిపిస్తోంది. ఈక్రమంలోనే అధికారులు చొరవ తీసుకొని కంచె ఏర్పాటు చేయాలని, రహదారి పక్క నుంచి తొలగించి వేరే వద్దకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదించవలసిన అధికారి: మెతుశాల, ఏఈ విద్యుత్‌శాఖ, భూత్పూర్, ఫోన్‌నంబర్: 94405 13475

పోరాట యోధుడు పాపన్న


జిల్లాకేంద్రంలో నివాళి అర్పిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సాక్షినెట్‌వర్క్: అణగారిన వర్గాల వారి జీవితాలలో వెలుగు నింపిన బహుజన నాయకుడు.. పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాపన్న జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లాకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సిములు, కౌన్సిలర్ రవికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కోయిల్‌కొండలో పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొన్నారు. మండల గౌడసంఘం అధ్యక్షుడు వై.పవన్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్, మండల అధ్యక్షుడు జి.రవీందర్, మాజీ ఎంపీపీ వై.మహేందర్‌గౌడ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్లలో బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, సీపీఎం నాయకులు కిల్లెగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

■ మూసాపేట, అడ్డాకులలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన్‌గౌడ్, ఇంద్రయ్యసాగర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


కోయిల్‌కొండలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

■ భూత్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, నారాయణ గౌడ్, సదానంద్ గౌడ్, సత్తయ్య గౌడ్, గోవర్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

■ నవాబుపేటలో గౌడ సంఘం జిల్లా నాయకులు గోపాల్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

■ రాజాపూర్‌లో మండల గౌడసంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, మల్లేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, బాలాగౌడ్, చంద్రకాంత్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, బాలస్వామిగౌడ్, నవీన్‌గౌడ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ హన్వాడ పరిధిలో బీజేపి మండల నాయకుడు రఘురాంగౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ గండేడ్‌లో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్ పరిధిలో గౌడ సంఘం నాయకులు రాజుగౌడ్, అంజన్నగౌడ్, వేణుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, వినోద్, రవి, బాబు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


మూసాపేటలో..


జడ్చర్లలో..


రాజాపూర్‌లో..

స్టేజ్ నిర్మాణానికి భూమిపూజ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్‌ఎస్ పాఠశాలలో స్టేజ్ నిర్మాణం కోసం ఆదివారం భూమిపూజ చేశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు (1978–79) ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, మహమ్మద్ సర్దార్, ఠాగూర్, అంజనా తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారం ఏర్పాటుకు..



దేవరకద్ర: వెంకటాయపల్లిలో ప్రసిద్ధి చెందిన రంగనాయకస్వామి ఆలయంనకు వెళ్లే రహదారిలో ముఖద్వారం నిర్మాణం కోసం ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన రఘుపతిసాగర్ అనే భక్తుడు తన తల్లిదండ్రులు కందూరి వెంకటయ్య, కిష్టమ్మల జ్ఞాపకార్థం నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హాజరయ్యారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

నవాబుపేట: పశ్చిమ బెంగాల్‌లో మహిళా డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనపై ఆదివారం మండల కేంద్రంలో యువత నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులతో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్, రవి, చందు, రఘు తదితరులు ఉన్నారు.

నిరసన

నవాబుపేట: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో యువకులు నిరసన తెలిపారు. అక్కడ అల్లర్లలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. యాదయ్య, రఘు, శాంతయ్య, రాఘవేందర్, శంకర్, రాఘవేందర్‌రెడ్డి, మాధవులు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

దేవరకద్ర: అడవి అజిలాపూర్‌నకు చెందిన కృష్ణయ్య, చిన్న లక్ష్మమ్మల కుమార్తె రాధిక వివాహానికి జీకేఆర్ ఫౌండేషన్ తరపున పుస్తె, మెట్టెలు, పట్టుచీరను అందజేశారు. ఆదివారం వివాహానికి హాజరైన ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, నవ్య దంపతులు ఈ మేరకు వాటిని పెళ్లి కుమార్తె రాధికకు అందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే..


మాట్లాడుతున్న కిల్లెగోపాల్

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తాము పూర్తి మద్దతునిస్తామని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులతోపాటు సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర నర్సింహులు హాజరై మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు కార్మికులకు మద్దతుగా మాట్లాడారు. కమిషనర్ రాజయ్య యూనియన్ నాయకులు రావద్దని కార్మికులే తనతో మాట్లాడాలని చర్చలు చేయాలని బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న పోస్టులేని వ్యక్తి ఇష్టానుసారంగా వ్యవహరించటాన్ని, మహిళలను దుర్భాషలాడటం, అసభ్యంగా ద్వందర్థాలతో మాట్లాడుతున్నారని తీవ్రంగా తప్పుపట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్యామాదిగ, భీంరాజ్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వసియాబేగం, యూటీఎఫ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి నర్సింహులు, గిరిజన విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయక్ మాట్లాడారు. సమావేశం అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులు బి.శివకుమార్‌ను కలుసుకుని సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు


ట్రోఫీ అందుకుంటున్న కింగ్‌షోటోకాన్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. మహ్మద్ సాబీర్‌పాష అండర్–12 విభాగం బ్రౌన్‌బెల్టులో సూఫియా అలీ అండర్–14 బ్లూబెల్టులో, బాలికల అండర్–12 అయేషా బేగం బ్లూబెల్టులో, ఉమ్మ ఖిజ్‌రాబేగం గ్రీన్‌బెల్టులో, మారియబేగం ఆరెంజ్ బెల్టులో, అమాన్‌అలీ మెరూన్ బెల్టులో, సయ్యద్ ఖాజా ఎల్లో బెల్టులో, అండర్–35 ఏళ్ల విభాగం కటాస్‌లో హాఫీజ్‌చాంద్‌పాష బంగారు పతకాలు, నిఖిల్, హఫ్సాబేగం, అస్మత్ ఫాతిమా రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా కింగ్‌షోటోకాన్ అకాడమీకి ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా మొయినాబాద్‌లో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ జిల్లా కేంద్రంలోని హమ్మిన్‌బర్డ్స్ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డూ ఇండియా వీఐపీ బ్లాక్‌బెల్టు ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ అశ్వాక్ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు సత్యనారాయణ, సాత్విక్ కటాస్ విభాగాల్లో మెరుగైన ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అశ్వాక్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాస్టర్లు లక్ష్మణ్ నాయక్, అన్సార్ పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పదును పెట్టాలి


బహుమతులు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

గండీడ్: విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టాలని వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. డ్రీమ్ ఫోర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ చరిత్రపై టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో కార్యక్రమం జరిగింది. ఈ టాలెంట్ పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో సల్కర్‌పేట్ ఉన్నత పాఠశాల పదోతరగతికి చెందిన విద్యార్థి శివకుమార్ మొదటి బహుమతి, తొమ్మిదో తరగతి విద్యార్థి అర్చన ద్వితీయ బహుమతి సాధించారు. కాగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి వారికి బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ లైబ్రరీ చైర్మన్ జనార్దన్, సల్కర్‌పేట్ ఫిజికల్ సైన్స్ టీచర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ. 2.40 లక్షలు స్వాధీనం
- నాలుగు వాహనాలు సీజ్

గండేడ్/మహమ్మదాబాద్: పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని పట్టుకోవడంతో పాటు వారికి సంబంధించిన నగదు, వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వారి కథనం ప్రకారం.. కప్లాపూర్ శివారులోని ఓ వ్యక్తి పొలం వద్ద కొంతమంది ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి వెళ్లి స్థావరంపై దాడిచేశారు. ఈ దాడిలో వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాలుగు వాహనాలను కూడ సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. ఈమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మరికల్: మండల కేంద్రంలో నామమాత్రంగా ఉన్న పెట్రోల్ బంకు నిర్వాహకులపై సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని పెట్రోల్ బంకుల్లో కొరత సృష్టిస్తు బ్లాక్‌లో అమ్మకాలను చేపట్టారని మండిపడ్డారు. లీటర్‌కు అదనంగా రూ. 20వసూలు చేస్తు బ్లాక్‌లో అమ్మకాలకు అలవాటుపడ్డ బంకుల యాజమాన్యంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.